క్లుప్తంగా

గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి చేపల పెంపకం



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు, కొర్రాయి, కురిడి, డుంబ్రిగుడ రైతులకు వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అరకు సంతబయిలులో చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సన్నీ, దామోదర్ మాట్లాడుతూ రైతులు సొంతంగా నిర్వహించే చెరువులు, ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విన చెరువుల్లో వీటిని పెంచుకోవాలని సూచించారు. చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి పొందుతారన్నారు. లక్ష చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రశాంత్, జి. రామ్, అప్పారావు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు



హెచ్చెం సువర్ణరాజ్

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి, ఇంటర్మీడియట్ వన్ సిట్టింగ్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కె.సువర్ణరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి లేదా ఆ లోపు విద్యార్హత కలిగి మధ్యలో విద్యను కొనసాగించలేకపోయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఉందని, ఆపై రూ.200 ఫైన్‌తో వచ్చే నెల 9వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

13న సాంస్కృతిక పోటీలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయభారతి తెలిపారు. ఆదివారం ఇక్కడ కళాశాలలో సిబ్బంది, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆ రోజు విద్యార్థులకు వ్యక్తిత్వ, వ్యాసరచన, దేశభక్తి గీతాలు, తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. 15 ఏళ్లలోపు వారికి, 15 ఏళ్లు దాటిన వారికి వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజవొమ్మంగి: స్థానిక మండల ప్రజా పరిషత్ పాలక మండలి సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నేడు

అరకులోయ టౌన్: వైఎస్. జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ విశాఖపట్నం, హైదరాబాదుకు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు వైఎస్. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు సుంకరమెట్ట గవర్నమెంటు ఆస్పత్రి వద్ద శిబిరంలో బీపీ, సుగర్‌తోపాటు చెస్ట్ ఎక్స్‌రే, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్‌కు ఉచితంగా పరీక్షలు చేస్తారు. రొమ్ములో కంతులు ఉన్నవారికి ఉచితగా మెమొగ్రాం పరీక్ష చేసి, గర్భాశయంలో రుతుస్రావంలో ఇబ్బంది ఉన్నవారికి పాప్ స్మియర్ పరీక్ష చేస్తారన్నారు. 20 సంవత్సరాలు పైబడిన అందరు ఈ పరీక్షలు చేయించుకోవాలని, ఈ శిబిరానికి వచ్చే వారు మీ యొక్క ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని కోరారు.





పాఠశాలలో దర్శనమిస్తున్న చెత్తాచెదారాలు

పారిశుధ్య లోపంతోనే వ్యాధులు

- ఏకలవ్య పాఠశాలను పరిశీలించి వైద్యాధికారి అసంతృప్తి





పారిశుధ్యంపై ప్రిన్సిపాల్, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని వివిధ పాఠశాలల్లో శానిటేషన్ సక్రమంగా చేయకపోవడం వల్లే విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర తెలిపారు. పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. శానిటేషన్ ఇన్స్‌పెక్షన్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని అన్ని ప్రదేశాలను, మరుగుదొడ్లను, వంటశాలను, డార్మెంట్రీలోని గదులను తదితర ప్రదేశాలను పరిశీలించారు. విద్యార్థుల బట్టలను ఎక్కడపడితే అక్కడ గుట్టలుగా పారేయడాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు. ఎక్కడపడితే అక్కడ ఆహార పదార్థాలు, చెత్త పడి ఉండడాన్ని గమనించారు. దీంతో పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం వరకు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేదని, ప్రస్తుతం పారిశుధ్య లోపంతో కనిపిస్తుందన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటర్ పైపులైన్లు లీకయ్యి ఎక్కడపడితే అక్కడ గుంతల్లో నీరు నిల్వ ఉండిపోతుందన్నారు. దీనివల్ల దోమలు వృద్ధి చెంది విద్యార్థులు మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టి అంతా పరిశుభ్రం చేయాలని ప్రిన్సిపాల్ బురారామ్ భైరవకు వైద్యాధికారి సూచించారు. వారం రోజుల తర్వాత తిరిగి మరోసారి ఇన్‌స్పెక్షన్ చేస్తానని, అప్పటికీ పరిశుభ్రం లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తున్న చెత్తాచెదారాలు

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన భీమన్న పడాల్

ముంచంగిపుట్టు: భీమన్నపడాల్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి తెలిపారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు మట్టం భీమన్న పడాల్‌కు అభినందన సభను ఆదివారం ముంచంగిపుట్టులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పాల్గొని ఉపాధ్యాయుడిగా భీమన్నపడాల్ చేసిన సేవలను ప్రశంసించారు. అతనితో పాటు సతీమణి సుందమ్మలకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ భీమన్నపడాల్ మాస్టర్ 39 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతగా తీర్చిదిద్దారని, ఇలాంటి ఉపాధ్యాయులు గిరిజన ప్రాంతానికి చెందిన వారు కావడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రకాశం, లక్ష్మి, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామకృష్ణ, కొండపడాల్, బాబూరావు, భాగత్‌రాం, మాలయ్య, కామేశ్వరరావు, అప్పారావు, కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.



భీమన్నపడాల్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ

అనకాపల్లి : మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామనే స్ఫూర్తితో ప్రజలందరూ సహకరించాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా తమ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. వృక్ష సంపద తగ్గి కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో దీని నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

వర్గీకరణతో ఉపకులాలు నష్టపోతాయి

తుమ్మపాల : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగితే అనేక ఉపకులాలు నష్టపోతాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బోన గణేష్ అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ విషయాన్ని ఎన్నికల ముందు తెరమీదకి తీసుకొచ్చారన్నారు. వర్గీకరణ గనుక జరిగితే జిల్లాల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాలలంతా కలిసి భవిష్యత్తు తరాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సియాద్రి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనిటరీ మెంబర్ గంగాధర్ మరియమ్మ, అప్పలరాజు, రాజన బుజ్జిబాబు, తట్టా రాజు, మరువడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం పాల్గొన్నారు

ప్రజాస్వామ్యంపై దాడి

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్

పాడేరు: రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహా శిల్పంపై దాడి అంటే, ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టేనని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో నెలకొల్పి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారన్నారు. రాష్ట్ర ఖ్యాతిని దేశ నలుమూలల చాటి చెప్పారన్నారు. మహనీయుని విగ్రహంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దాడి చేసి రాష్ట్ర ప్రతిష్టను మంట కలిపిందన్నారు. ఇలాంటి సంఘటలతో రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజన, ప్రజాస్వామికవాదులు, మేధావుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎలాంటి హామీలు ఇవ్వకుండా అంబేడ్కర్ మహా శిల్పం ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిల్పం వద్ద అప్పటి సీఎం వైఎస్ జగన్ పేరును తొలగించడంతోపాటు లైటింగ్‌ను ధ్వంసం చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు.

భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

తుమ్మపాల : బడిఈడు పిల్లలు భిక్షాటన చేయడం రోడ్లపై నిత్యం చూస్తూనే ఉంటాం. అలా వచ్చిన నగదుతో కుటుంబానికి సహాయంగా ఉంటారనుకుని అందరం తోచిన చిల్లరి ఇస్తూ పిల్లలను శాశ్వతంగా బిచ్చగాళ్లను చేసేస్తున్నాం. దీంతో పిల్లల భిక్షాటన ఇప్పుడు నేరుగా దేవాలయాల్లోనే సాగుతోంది. ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో బడిఈడు పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పట్టణం, కశింకోట ప్రాంతాల నుంచి 20 మందికి పైగా బడిఈడు పిల్లలు వివిధ వేషధారణలు, పేర్లు మార్చుకుంటు, అంగవైకల్యం ప్రదర్శిస్తు భిక్షాటన చేస్తు రోజంతా గడిపేస్తున్నారు. అమ్మవారి దర్శనం నిమిత్తం వచ్చిన భక్తుల నుంచి చిల్లరతో పాటు ప్రసాదాలు, భోజనం దొరకడంతో రాత్రి 8 వరకు ఉంటునప్పటికీ పట్టించుకునేవారే లేకుండా పోయారు. దేవాలయంలో ఈవో కార్యాలయం వద్ద నేలపై వరుసగా కూర్చుని భిక్షాటన చేస్తున్న పిల్లలు అధికారులకు కనిపించడం లేదు. కనీసం ల్యాబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ అధికారులైనా దృష్టి సారించి వారి వివరాలు తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీనూకాంబికా ఆలయంలో భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



రూ.50,116 విరాళం అందజేస్తున్న రమేష్ దంపతులు

మునగపాక : మూలపేట గంగాలమ్మతల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. తోటాడకు చెందిన దొడ్డి రమేష్, భవానీ దంపతులు, కుమారులు హర్షవర్ధన్, ఆనంద్‌వర్ధన్ ఆదివారం రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులతో ఆసరా

కశింకోట : మహిళలు ఆర్థికంగా బలపడటానికి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు దోహదపడతాయని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో మహిళలు ఏ కార్యక్రమం చేపట్టినా విజయం తథ్యమన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తో వారి కుటుంబాలకు ఆసరా దొరుకుతుందన్నారు.
40 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం శివ రాజశేఖర్, సేవాదళ్ కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యస్వామి, శిక్షకులు నాగమణి, హేమ, కన్వీనర్ వెంకటరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనాయుడు

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



బ్రాండిక్స్ అపెరల్ సిటీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీ నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించిన 130వ కంటి వైద్య శిబిరానికి 600 మంది విచ్చేయగా వారిలో 400 మందికి పరీక్షలు నిర్వహించి, 245 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.100 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయాలు కల్పించారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ గొడ్డ గ్రామంలో ఏపీ గిరిజన విలేకరుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని గిరిజన విలేకరుల సంఘం ప్రతినిధులు పంపిణీ చేశారు. 13 ఏళ్లగా గిరిజన ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన విలేకరుల సేవా సంఘం ప్రతినిధులు సూర్యారావు, రమణ, సునీల్, రాచంద్రరావు, మత్స్యలింగం,అరుణ్, గంగాధర్, అఖిల్ తదితరలు పాల్గొన్నారు.



గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న గిరిజన విలేకరుల సేవా సంఘం నాయకులు

ఉపాధ్యాయ దంపతులు మొక్కల వితరణ

కూనవరం: పెదార్కూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు పాయం కన్నారావు, కుమారి పర్యావరణ పరిరక్షణకు దోహదపడేందుకు వీలుగా 50 పండ్ల మొక్కలను మాంచనగిరి యూత్‌కు ఆదివారం వితరణగా ఇచ్చారు. బాదం, మామిడి, సపోటా, రామాఫలం, కందంబం, కానుగ తదితర నీడను ఇచ్చే మొక్కలను యూత్ కమిటీ సభ్యులు పెదార్కూరు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, అభయాంజనేయ స్వామి, మాంచానమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం, చర్చి కాలనీ ఆవరణలో, బండారు గూడెం బస్ షెల్టర్, మైన్ రోడ్డు పక్కన నాటారు. కార్యక్రమంలో మాంచనగిరి యూత్ సభ్యులు చిచ్చడి రాజు, అశోక్, చిచ్చడి సుబ్బరాజు, పూసం సాయికిరణ్, రాము, ధర్ముల శివ, శంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



పెదార్కూరులో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాగునీరు అందివ్వడమే లక్ష్యం

డుంబ్రిగుడ: మేజర్ పంచాయతీ అరకుసంతబయిలు ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా సర్పంచ్ జి.శారద కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మేజర్ పంచాయతీ అరకులో ఐదు తాగునీటి బావులను శుభ్రం చేయించి ప్లాట్‌ఫాంలను మరమ్మతులు చేయించారు. వ్యర్థాలు వేయకుండా వాటి పైభాగంలో గ్రిల్స్‌ను అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల తాగునీరు బావులు పూర్తిగా బురదనీరుతో కలుషితమయ్యాయని తెలిపారు. అందులో భాగంగా ఆ నీరు తాగితే టైఫాయిడ్, విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బావులను శుభ్రపరిచి చర్యలు తీసుకున్నామన్నారు. వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



బావులపై గ్రిల్స్, మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ శారద

3,500 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

రాజవొమ్మంగి: మండలంలో 3,500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు ఆదివారం తెలిపారు. మండలంలో ఖరీఫ్ వరి సాగు సాధారణ విస్తీర్ణం 5,200 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 62 శాతం నాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. గత నెలలో ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా నాట్లు ఆలస్యంగా పడ్డాయన్నారు. మరో వారం రోజుల్లో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

ఈ – క్రాప్ నమోదు తప్పని సరి:–
మండలంలో ఈ – క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలు, సాగు విస్తీర్ణం వ్యవసాయాధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతు క్షేత్రాలకు వచ్చే వీవోఏలకు రైతులు పేర్లు, సర్వే నంబర్ ఇచ్చి సహకరించాలని కోరారు.



రాజవొమ్మంగిలో వరి నాట్లు

రంపచోడవరం వారపు సంతలో తనిఖీలు

రంపచోడవరం: సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వారపు సంతలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ హడహళ్లి ఆదేశాల మేరకు ఇక్కడ సంతలో పలువురు వ్యాపారులు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు. గంజాయి రవాణాను, వాడకాన్ని నిర్మూలించాలన్నారు. వీటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.



వారపు సంతలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై మోహన్‌కుమార్ తనిఖీలు

స్వీట్‌కార్న్ సాగుకు రైతుల ఆసక్తి



బొట్టవానిపాలెంలో సాగులో ఉన్న స్వీట్‌కార్న్ పంట



కోతదశకు చేరిన స్వీట్‌కార్న్ మొక్కజొన్న

- మండలంలో 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్టప్రాంత గ్రామాల రైతులు ఖరీఫ్‌లో భాగంగా స్వీట్‌కార్న్(మొక్కజొన్న) పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మూడు నెలల వ్యవధిలో పంట కోత దశకు రానుండటం, మార్కెట్లో కాస్త డిమాండ్ ఉండటంతో పలువురు రైతులు సంప్రదాయ పంటల స్థానంలో స్వీట్‌కార్న్‌వైపు దృష్టి సారిస్తున్నారు. మండలంలోని బొట్టవానిపాలెం, కె.సంతపాలెం, అర్లి, గొల్లలపాలెం, పాతవలస, సూదివలస గ్రామాల రైతులు 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంటను సాగు చేస్తున్నారు. పంట సాగు సమయంలో చేపట్టే దుక్కులు, విత్తనాలు, సస్యరక్షణ మందులు, నీటి తడులకు ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి సరిపోతుందని, ఖర్చులు పోనూ ఎకరానికి కనీసం రూ.30 వేలు వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు చెప్పున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట కోతదశకు చేరుకుంది. పంటను స్థానికంగా విక్రయించడంతోపాటు విశాఖపట్నం, గాజువాక, విజయనగరం ప్రాంతాల్లోని మార్కెట్లకు తీసుకెళ్లి రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. పెట్టుబడి వ్యయం, శ్రమ తక్కువ కావడంతోపాటు, మార్కెట్లో డిమాండ్ ఉండి, ఆదాయం కూడా బాగుండటంతో స్వీట్‌కార్న్ సాగు చేస్తున్నట్లు రైతులు చెప్పున్నారు.